క్లుప్తంగా

నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు



సూర్యాపేటలో నంబర్ ప్లేట్ లేకుండా పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

సూర్యాపేట : నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలను పట్టుకుని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ రాజశేఖర్ మాట్లాడారు. వాహనాలకు పెద్ద పెద్ద సైరన్‌లు పెట్టవద్దని తెలిపారు వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.

ఏబీపీఎం శ్రీనునాయక్‌కు సన్మానం



శ్రీనునాయక్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

అర్వపల్లి : అర్వపల్లి సబ్ పోస్టాఫీసు పరిధిలోని పాతసూర్యాపేట ఏబీపీఎంగా పనిచేస్తున్న కె.శ్రీనునాయక్ పోస్టల్ ప్రమాదబీమా పాలసీలను సర్కిల్‌లోనే అత్యధికంగా చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో శనివారం శ్రీనునాయక్‌ను అర్వపల్లి పోస్టాఫీసులో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం షకీల్, బీపీఎంలు రామాచారి, బి.నవీన్, గోపి, కె.నవీన్, ఏబీపీఎంలు మహేష్, యాకూబ్, మదార్‌హుస్సేన్, గోపి, సురేష్, జావిద్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడికి నివాళి



తిమ్మాపురంలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గౌడ్

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఉప్పు ఆనందరావు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, గ్రామ కాంగ్రెస్ నాయకులు శనివారం వేరువేరుగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పాల సంఘం మాజీ చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, కందుల దశరథరామారావు, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, కందుల చిన తిరుమలరావు, వేములకొండ ఉప్పలయ్య, ఈదునూరి సంతోష్ తదితరులు ఉన్నారు.

వాన రాదాయే.. నాట్లు పడవాయే

- ఈ సీజన్‌లో ఆశించినంతగా కురవని వర్షాలు
- తగినంత నీరు లేక వరినాట్లు వేయలేకపోతున్న రైతులు
- ముదురుతున్న నారుమళ్లు

సూర్యాపేట రూరల్ : ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు వరి పంటపై భారీ ఆశలు పెంచుకున్నారు. కానీ ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో వరి నారు ముదిరిపోయే దశకు చేరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ బావుల్లో, బోర్లలో ఏ మాత్రం భూగర్భ జలాలు పెరగలేదని రైతులు తెలుపుతున్నారు. పైగా పంట పొలాల్లో కలుపు మొక్కలు ఏపుగా



పంట పొలాల్లో పెరిగిన కలుపు మొక్కలు

పెరుగుతున్నాయి. దీంతో వరి సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు వాపోతున్నారు. సూర్యాపేట మండలంలోని 23 గ్రామాల్లో రైతులు దాదాపు 10 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ప్రధానంగా వరి సాగుకే మొగ్గు చూపారు. కానీ ప్రస్తుతం తగినంత వర్షాలు కురవక ఈ భూములన్నీ బీడులుగానే దర్శనమిస్తున్నాయి.

బావుల్లో నీళ్లు పెరగలేదు

ఇటీవల కురిసిన వర్షాలకు బావుల్లోకి నీళ్లు ఏ మాత్రం రాలేదు. నీరు లేక పొలాలను దున్నలేని పరిస్థితి ఉంది. దీంతో ఏమి చేయాలో తెలియడం లేదు. వరి నారు మాత్రం రోజు రోజుకూ ముదురుతోంది. వర్షాలు భారీగా కురిస్తేనే వరి పంట సాగుకు వీలవుతుంది.

– శేఖర్, రైతు, తాళ్లఖమ్మంపహాడ్

డ్రమ్ సీడర్ సాగుతో లాభాలు

డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేసుకుంటే రైతులు లాభాలు పొందవచ్చు. ఈ పద్ధతి సాగుతో రైతులకు చాలామేలు జరుగుతుంది. రైతులు వరిసాగుతోపాటు మెట్ట పంటలపై కూడా దృష్టి సారించాలి.

– దినకర్, మండల వ్యవసాయ అధికారి

పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు



మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

సూర్యాపేట : వర్షాలకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలుస్తోందని, మున్సిపల్ అధికారులు పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించొద్దని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. మురుగు నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని మున్సిపల్ అధికారులను ఫోన్‌లో కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో కార్మిక రంగానికి పెద్ద పీట



కేసీఆర్, కిషోర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

తుంగతుర్తి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక రంగానికి పెద్దపీట వేసిందని బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు గౌరిచర్ల సత్యనారాయణ అన్నారు. శనివారం నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో అసంఘటితంగా ఉన్న కార్మికులను సంఘటితం చేసిన ఘనత కిషోర్ కుమార్ దేనని అన్నారు. నిర్మాణ రంగాన్ని నమ్ముకున్న వందలాది మంది కార్మికులకు మాజీ ఎమ్మెల్యే కిషోర్ తన సొంత ఖర్చులతో లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు అందజేశారని తెలిపారు. కార్మికులందరికీ మాజీ ఎమ్మెల్యే కిషోర్ అండదండలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు సోమేష్, వీరు నాయక్, రవి, రాజేష్, సురేష్, తిరుపతి, వెంకన్న, జయమ్మ, ముత్తయ్య, రమణమ్మ, సుజాత, అభినవ్, రామచంద్రు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి లింగమంతులస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా ఇటీవల రద్దు చేశారని, వాటిని తిరిగి మంజూరు చేయించి పనులు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని అన్నారు. వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డులో మిగిలిపోయిన పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. దీంతో ఎంపీ స్పందించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బింగి కృష్ణమూర్తి, సుతారపు అనిల్, నోముల నరేష్, గౌని వెంకన్న, నసీర్, శివ, గణేష్, బద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులు, టీచర్లకు సన్మానం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులతో పాటు ఇటీవల పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులను శనివారం స్థానిక పాఠశాలలో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు సత్కరించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన గెజిటెడ్ హెచ్‌ఎం దీపాదేవిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, కుమారి, అంజన్‌రెడ్డి, కె.పద్మ, ఎండీ. సాజిదా బేగం, ఎస్.రామచంద్రయ్య, బి.నరేందర్, అరుణకుమారి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వీరమ్మ, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు, జర్నలిస్టులు హెల్త్ కార్డులను వెంట తెచ్చుకోవాలని వారు కోరారు.

అపరిశుభ్రంగా ఉన్న హోటల్‌కు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట : పట్టణంలో పోస్టాఫీస్ ప్రాంతంలోని రాయల్ ఫుడ్ కోర్ట్ పరిసరాలు, లోపల అపరిశుభ్రంగా ఉన్నందున ఫుడ్ కోర్ట్ నిర్వాహకుడు జానిపాషకు మున్సిపల్ అధికారులు శనివారం రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో హోటళ్ల యాజమాన్యాలు తమ హోటళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మురిగిన, పులిసిపోయిన, నిల్వ ఉంచిన పదార్థాలను వినియోగదారులకు అందిస్తే హోటళ్లను సీజ్ చేయడంతోపాటు భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, బూర సతీష్, హెల్త్ అసిస్టెంట్ మస్కపురం సురేష్, జవాన్లు ములకలపల్లి పరశురాములు, పిడమర్తి ప్రసాద్, దండు ఉపేందర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ లోన్ సంస్థ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న బాధితులు

సూర్యాపేటటౌన్ : ఇండెల్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తమ బంగారంపై ఫోర్జరీ సంతకాలతో అధిక వడ్డీకి లోన్ తీసుకున్న సంస్థ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని సూర్యాపేటకు చెందిన బాధితులు బుర్ర శ్రీనివాస్, సరస్వతి దంపతులు అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం ఇండెల్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ లోన్ సంస్థ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ అవసరాల కోసం ఇండెల్ గోల్డ్‌లోన్ సంస్థలో బంగారం తాకట్టు పెట్టి రూ.18 లక్షలను 10పైసల వడ్డీకి తీసుకున్నామని తెలిపారు. అయితే సదరు గోల్డ్ లోన్ సంస్థ మేనేజర్ తమకు తెలియకుండానే సంతకాలను ఫోర్జరీ చేసి బంగారంపై మరో రూ.2లక్షలను అధిక వడ్డీకి తీసుకున్నాడని అన్నారు. దీంతో వడ్డీలతో కలిపి రూ.30 లక్షల వరకు లోన్ పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేదేమిలేక అధిక వడ్డీకి లోన్ తీసుకని రెన్యువల్ చేశామని తెలిపారు. అయితే మరో రూ.3లక్షలు చెల్లించాల్సి ఉందని.. లేకుంటే బంగారం వేలానికి పోతుందని బ్యాంక్ నుంచి బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. సంస్థ మేనేజర్‌పై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అలాగే మరికొందరు బాధితులు సంధ్య, అన్నపూర్ణలు మాట్లాడారు. ఈ సంస్థలో చాలా అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు పత్తిపాక నాగేశ్వరి, W/o మురళి, వయస్సు:37 సంవత్సరములు, వృత్తి:గృహిణి, తుల్జారావుపేట గ్రామము, చివ్వెంల మండలం, సూర్యాపేట జిల్లా వాస్తవ్యురాలు గతంలో భేదిరాగ్ మాదారం రెవిన్యూ గ్రామంలోని సర్వే నెంబరు. 59 లో 182 గజముల ఖాళీ స్థలం కొనుగోలు చేసి రిజిస్టర్ సేల్ డీడ్ నెంబర్ 13453/2023, తేది. 30.09.2023 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మా క్లయింటు తనకు అమ్మినవారి నుండి సదరు భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెంబరు. 2495 / 1996, రిజిస్ట్రేషన్ తేది. 11.07.1996 ను తీసుకుని తేది 09.07.2024న వారి స్వగ్రామమైన తుల్జారావుపేటకు పెన్ పహాడ్ మండల కేంద్రం నుండి వెళుచుండగా మార్గ మధ్యలో దుబ్బతండా గ్రామ సమీపంలో పోయినవని, ఎంతగా వెతికినను అవి దొరకలేదని తెలియచేసినారు. మా క్లయింటు పత్తిపాక నాగేశ్వరి, W/o మురళి తన భూమికి సంబంధించిన నెంబరు. 2495/1996, తేది. 11.07.1996 గల దస్తావేజును ఏవైనా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో కానీ, వ్యక్తుల వద్ద కానీ తనఖా పెట్ట లేదని స్పష్టం చేసినారు. ఈ ప్రకటన అంశంపై, షెడ్యూల్ భూమిపై ఎవరికైనా అక్షేపణలు ఉన్నట్లయితే ఈ ప్రకటన వెలువడిన (7) రోజులలోపు తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములు పరిగణనలోనికి తీసుకోబడవు.

డాక్యుమెంట్ నెంబరు 2495/1996, తేది .11.07.1996 షెడ్యూల్ ఆస్తి : భేదిరాగ్ మాదారం రెవిన్యూ గ్రామంలోని సర్వే నెంబరు 59 లో 242 గజముల ఈ క్రింది హద్దులలో గల నివాస స్థలము హద్దులు : ఉత్తరం : ఎర్ర నక్కు బాయమ్మ గారి స్థలం, దక్షిణం : ఎర్ర దాసు గారి స్థలం, తూర్పు : ఎర్ర పెద్ద ఎల్లయ్య గారి ఖాళీ స్థలం, పడమర : 20 ఫీట్ల రోడ్డు

సం/- రాధా కృష్ణ పత్తిపాక అడ్వకేట్, సూర్యాపేట. సెల్:9984847494, 7780638947

జన్మదిన వేడుకల సభా స్థలం పరిశీలన



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఎమ్మెల్యే మందుల సామేల్ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ తెలిపారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న సభా స్థలిని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, బి.పి.డానియల్, శాగంటి రాములు, కొమురమల్లు, మోహన్, రషీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నాగారం మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఎమ్మెల్యే మందుల సామేల్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలకంటి సోమన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సామేల్ జన్మదిన వేడుకలకు కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

అర్వపల్లి : తిరుమలగిరిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించే ఎమ్మెల్యే సామేల్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరుకావాలని పేర్కొన్నారు.

చెరువు కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు

మద్దిరాల : చెరువు తూము తెరుస్తున్న వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వహీద్ శనివారం తెలిపారు. చిన్ననెమిల చెరువు కాంట్రాక్టర్ తరుచూ చెరువు తూము తీస్తున్నాడని రైతులు తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేశారని అన్నారు. దీంతో కాంట్రాక్టర్‌కు పలుమార్లు చెప్పినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేద, దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు ఆర్ఐ పేర్కొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామారావు

కోదాడరూరల్ : బహుజన సమాజ్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన సాలే రామారావు నియమితులయ్యారు. శనివారం కోదాడ పట్టణంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి బాబురావు ఆదేశాల మేరకు రామారావును నియమించి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి స్టాలిన్ అంబేద్కర్, పార్టీ ఉపాధ్యక్షుడు చింతల రమేష్, కాంపాటి వీరస్వామి, షేక్ హుస్సేన్, శ్రీనివాసచారి, అంజిరెడ్డి, దుర్గారెడ్డి, నాగేశ్వరరావు, నాగ, సక్రు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు

అర్వపల్లి : మొహర్రం పురస్కరించుకొని మండల వ్యాప్తంగా పీర్ల ఊరేగింపు సందడి నెలకొంది. జాజిరెడ్డిగూడెం, కొమ్మాల, కాసర్లపహాడ్, బొల్లంపల్లి తదితర గ్రామాల్లో మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు కలిసి పీర్ల పండుగను జరుపుకుంటున్నారు. గ్రామాల్లో పీర్ల ఊరేగింపు సందర్భంగా ఇంటింటికీ నీళ్లారబోసి కుడకలు, దట్టీలు కడుతున్నారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాహకులు, ముజావర్లు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలని వినతి

కోదాడరూరల్ : ఖమ్మం నుంచి కోదాడ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 365ఏ వెంట దుర్గాపురం క్రాస్ రోడ్ నుంచి అల్వాలపురం వరకు సర్వీస్ రోడ్డు నిర్మించాలని పలు గ్రామాల రైతులు శనివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లతో పాటు బీజేపీ ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేశారు. హైవే వెంట సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో తమ్మరబండపాలెం, అల్వాలపురం, అశోక్‌నగర్, దుర్గాపురం గ్రామాల రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు హరికృష్ణ, కోటినారాయణ, వేముల దాసు, నాగేశ్వరరావు, కోటయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

నూతనకల్ : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకొని, వాటి నుంచి అప్రమత్తంగా ఉండాలని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినట్లయితే వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జూకూరి సైదులు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గ్రామాలు



పిల్లల జెగ్గు తండాలో నిలిచిన మురుగు నీరు



అక్కలదేవిగూడెంలో చెత్తా చెదారం

- కొరవడిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

చివ్వెంల : పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలనతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఒక్కో అధికారికి ఒకటి, రెండు గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో వారిపై పనిభారం పెరిగి పూర్తి స్థాయిలో పాలన చేపట్టలేకపోతున్నారు. అధికారులు కేవలం చుట్టపు చూపుగా పల్లెల్లో పర్యటిస్తుండటంతో సమస్యల చిట్టా క్రమేణా పెరుగుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరతున్నారు.

భారంగా విధులు నిర్వహణ..

చివ్వెంల మండలంలో 31 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నేలాఖరున గ్రామాల్లో పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఒక్కో అధికారికి రెండు గ్రామాలు అప్పగించడంతో వారికి ఆయా గ్రామాల్లో పర్యటించడం రోజువారిగా సాధ్యం కావడం లేదు. కనీసం వారానికి ఒకసారైనా ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పర్యటించలేకపోతున్నారు. దీనికి తోడు ప్రత్యేకాధికారులకు సొంత విధులు ఉంటాయి. ఉన్నతాధికారులతో సమీక్షలు, సమావేశాలకు హాజరు కావాలి. దీంతో కొంతమంది అధికారులు సాకులు చెప్పి విధులకు దుమ్మా కొడుతున్నారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరిస్తాం

గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యటించేలా చర్యలు తీసుకుంటాం. కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేస్తాం. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తాం.

– సీహెచ్. సంతోష్ కుమార్, ఎంపీడీఓ, చివ్వెంల

గ్రామాల్లో సమస్యలు..

మండలంలోని చాలా గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మిషన్ భగిరథ పైపులైన్లు చాలా చోట్ల లీకై నీటి సరఫరా కావడం లేదు. పాడైన బోర్లను కొన్ని చోట్ల రిపేరు చేయించారు. అయితే కొన్ని గ్రామాల్లో ఇంకా మరమ్మతులు చేపట్టలేదు. పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతోంది. కేంద్ర ప్రభుత్వ నిధులు రెండు నెలలకోసారి రావడంతో సరిపోక గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వల్ల కూడా అధికారులు సమస్యలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూ, చెప్పులను ఇన్‌చార్జ్ వార్డెన్ పద్మ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వసతి గృహంలో ఉంటున్న 76 మంది విద్యార్థినులు స్థానిక జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలతోపాటు మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు పొందాలని అన్నారు.